సాక్షి వికారాబాద్

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



ఇక రెండు రోజులే!

తాండూరులో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. 10లో▸



70 గొర్రెలు మృత్యువాత

హైదరాబాద్ - బీజాపూర్ నేషనల్ హైవేపై గుర్తు తెలియని వాహనాలు ఢీకొని 70 గొర్రెలు మృతిచెందాయి. 10లో▸



శిలా ఫలకానికే పరిమితం!

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది తాండూరు మైన్స్ ఏడీ కార్యాలయ పరిస్థితి మారింది. 11లో▸

న్యూస్‌రీల్

బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కుల్కచర్ల: విధులు సక్రమంగా నిర్వహించే వారికి గుర్తింపు, గౌరవం లభిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్, కుల్కచర్ల మండల వైద్యాధికారి కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. గురువారం పీహెచ్‌సీలో ఫార్మాసిస్టుగా విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్ పదోన్నతిపై గాంధీ ఆస్పత్రికి వెళ్లనుండటంతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధ్యతగా పని చేసేవారిని ప్రజలు ఎప్పటికీ మరచిపోరని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు మాధురి, వైద్య సిబ్బంది వెంకటేష్, అంజూ, నవీన్, శ్రీను, వినోద్, వెంకటయ్య, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల కిచెన్‌లో పేలిన కుక్కర్

వంట మనిషి, ఇద్దరు విద్యార్థినులకు గాయాలు



తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని నర్సింగ్ మహిళా కళాశాల కిచెన్‌లో బుధవారం ప్రెషర్ కుక్కర్ పేలిన ఘటనలో వంట మనిషితో పాటు ఇద్దరు విద్యార్థినులు గాయపడ్డారు. పట్టణంలోని పీపీ యూనిట్‌లో కొనసాగుతున్న నర్సింగ్ కళాశాలలో వంట చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో ప్రెషర్ కుక్కర్ పేలింది. అక్కడే వంట చేస్తున్న వంట మనిషి, భోజనం వడ్డించుకుంటున్న ఇద్దరు విద్యార్థినులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

జిల్లా ఆస్పత్రికి మరమ్మతులు చేయండి

సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



తాండూరులోని జిల్లా ఆస్పత్రి పైభాగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తాండూరు టౌన్: వర్షాలకు లీకేజీ అవుతున్న తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం మండల అభివృద్ధి అధికారి విశ్వప్రసాద్, పంచాయతీ రాజ్ ఏఈ నందినితో కలిసి ఆస్పత్రిని సందర్శించారు. భవనం పైకప్పు నుంచి వర్షపు నీరు ఆపరేషన్ థియేటర్, ఓపీ విభాగాల్లోకి లీకేజీ అవుతుండటాన్ని పరిశీలించారు. రోగులకు ఇబ్బంది లేకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు.



అలుగు పారుతున్న కోట్‌పల్లి ప్రాజెక్టు

అలుగు.. పరుగు

ధారూరు మండలం కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పారుతోంది. రుద్రారం - నాగసమందర్ మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పర్యాటకుల సందడి చేస్తున్నారు. యువకులు నీటిలోకి వెళ్లి సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. పోలీసుల రాకతో బయటికి వచ్చేశారు. ధారూరు - తాండూరు వయా నాగసమందర్, పెద్దేముల్ మీదుగా రాకపోకలు ఆగిపోయాయి. 18 గంటల పాటు ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు పడ్డారు. - ధారూరు



రుద్రారం - నాగసమందర్ మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



కలెక్టరేట్‌లో చిన్నారులతో కలిసి పూజలు చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఘనంగా..గణేశ్ వేడుకలు

వినాయక చవితి పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. వీధుల్లో భారీ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలు కిటకిటలాడాయి. - అనంతగిరి



పూజలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ కుటుంబ సభ్యులు



వినాయకుడికి హారతి ఇస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

‘ఇందిరమ్మ’పై ఫోకస్

స్థానిక ఎన్నికల్లోపు కొన్ని ఇళ్లయినా ప్రారంభించాలనే యోచనలో సర్కారు

- జిల్లాకు రెండు విడతల్లో 28 వేలు మంజూరు
- ప్రొసీడింగ్స్ అందుకున్న లబ్ధిదారులు 6,281 మంది
- మొదటి విడత చెక్కు అందుకున్న వారు 2,034 మంది
- రూ.లక్ష చొప్పున రూ.25.88 కోట్లు చెల్లింపులు
- పూర్తయిన ఇళ్లు 6



తాండూరు మండలంలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి లబ్ధిదారుడితో మాట్లాడుతున్న అధికారులు

వికారాబాద్: స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న వేళ అధికారులు సంక్షేమంపై దృష్టి సారించారు. అభయహస్తం ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పనుల్లో వేగం పెంచేందుకు సిద్ధమయ్యారు. స్థానిక పోరు నేపథ్యంలో ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు ఆరు నెలలుగా సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తున్నారు. రేషన్ కార్డుల మంజూరు, రైతు భరోసా, ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ తదితర పథకాలపై ఫోకస్ పెట్టారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ శాఖలో ఇంజనీర్ల కొరత ఆటంకంగా మారుతోంది.

6,505 ఇళ్లకు మార్కింగ్

జిల్లాకు రెండు విడతల్లో 24 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మొదటి విడతలో 2,309, రెండో విడతలో 9,372 ఇళ్లు కేటాయించారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. 6,505 ఇళ్లకు మార్కింగ్ కూడా చేశారు. 2,034 మంది పునాది పనులు పూర్తి చేయడంతో వారి ఖాతాల్లో లక్ష చొప్పున రూ.20.34 కోట్లు జమ చేశారు. మరో 156 మంది రూఫ్ లెవెల్ వరకు పూర్తి చేయగా వారికి రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.3.12 కోట్లు జమ చేశారు. మరో 53 మంది రూఫ్ కాస్ట్ లెవెల్ వరకు పూర్తి చేయగా వారికి రూ.4 లక్షల చొప్పున రూ.2.12 కోట్లు అందజేశారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆరు ఇళ్లు పూర్తి కాగా ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున చెల్లించారు. అయితే ఇంజనీర్ల కొరత కారణంగా పనులు వేగంగా సాగడం లేదని తెలిసింది. హౌసింగ్ శాఖలో ముగ్గురు డీఈలు, 14 ఏఈలు మాత్రమే ఉన్నారు. వీరికి పర్యవేక్షణ కష్టంగా మారింది.

స్థలాలు లేని వారికి ఎప్పుడో?

ప్రస్తుతం స్థలం ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. స్థలాలు లేని వారి పరిస్థితి గందరగోళంగా మారింది. ప్రభుత్వం కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం మధ్యలో ఆపేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లయినా తమకు కేటాయించాలని కోరుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాకు 5,740 డబుల్ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 2,257 వివిధ దశల్లో ఉన్నాయి. 1,031 చిన్న చిన్న పనులు మినహా పూర్తి కావచ్చాయి. మరో 512 కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాయి.ధారూరులో 120 ఇళ్లు, మర్పల్లిలో 120, యాలాల మండలం కోకట్‌లో 180, తాండూరు పట్టణంలో 401, పరిగిలో 180, చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్‌లో 30 పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వీటిని తమకు కేటాయించాలని స్థలం లేని పేదలు కోరుతున్నారు.



ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్

లక్ష్మీదేవిపల్లిలో కదలిక!

- చౌదరిగూడలో స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, ఇంజనీర్ల బృందం
- రంగారెడ్డి - పాలమూరు ఎత్తిపోతల పథకంలో ఇదే చివరిది
- 1,512 ఎకరాల విస్తీర్ణం.. 2.8 టీఎంసీల సామర్థ్యం
- రిజర్వాయర్ పూర్తయితే పరిగి, షాద్‌నగర్ రైతులకు లబ్ధి

సాక్షి, రంగారెడ్డిజిల్లా/పరిగి: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో మళ్లీ కదలిక వచ్చింది. పదేళ్ల క్రితమే రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటి వరకు తట్టెడుమట్టిని కూడా తవ్వలేదు. పాలకుల నిర్లక్ష్యంతో ఏళ్లుగా అపరిష్కృతంగా మారిన ఈ నిర్మాణ ప్రదేశాన్ని గురువారం ఇరిగేషన్ విభాగం చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఈఈ సీతారాం నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం సందర్శించడంతో నిర్మాణ పనుల్లో మరోసారి కదలిక మొదలైంది. ఇప్పటికే ప్రభుత్వం ఇటీవలి బడ్జెట్‌లో నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. సాంకేతిక అనుమతులకు తోడు నిధుల కేటాయింపు జరిగి, సకాలంలో రిజర్వాయర్ పూర్తయితే ఇటు రంగారెడ్డి, అటు వికారాబాద్ జిల్లాల్లోని 4.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్‌సిటీకి సైతం నీటి సరఫరా కానుంది. తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలు తీరనున్నాయి.

పదేళ్ల క్రితమే శంకుస్థాపన

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదరిగూడెం మండలం పద్మారం రెవెన్యూ పరిధిలో 1,512 ఎకరాల విస్తీర్ణంలో సముద్ర మట్టానికి 670 మీటర్ల ఎత్తులో.. కట్టపొడవు 6.05 కిలోమీటర్లతో, 2.8 టీఎంసీల సామర్థ్యంతో కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ (చివరి ప్రాజెక్ట్)నిర్మించాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు 2015 లోనే రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. తర్వాత ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించక పోవడం, పర్యావరణ అనుమతులు రాకపోవడం తదితర సాంకేతిక సమస్యలతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతోపాటు ఇప్పటికే బడ్జెట్‌లో నిధులు కేటాయించడం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గత జనవరిలో ఇక్కడ పర్యటించి, త్వరలో భూసేకరణ ప్రారంభించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా రిజర్వాయర్ నిర్మాణ పనుల పరిశీలన కోసం సాగునీటి పారుదలశాఖ ఇంజనీర్ల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించడంతో జిల్లా ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సత్వరం పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రతి ఎకరాకూ నీరందిస్తాం

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాకు సాగునీటి ప్రాజెక్టులు మంజూరు చేస్తే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని కట్టకుండా తీవ్ర అన్యాయం చేసిందని పరిగి, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు టీ రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. మన ప్రాంతాని కి రావాల్సిన నీటిని ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం పరిగి పట్టణంలోని ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై అధికారులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణలో రెండు దఫాలుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం చేసిందన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తే బీఆర్‌ఎస్ వాటిని కాళేశ్వరానికి మళ్లించిందన్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్ల కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. త్వరలో పనులు ప్రారంభవుతాయాని చెప్పారు. 2.8 టీఎంసీల ప్రాజెక్టును 5 టీఎంసీలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం కాళేశ్వరాన్ని కూలేశ్వరంగా మార్చిందని, తాము పకడ్బందీగా నిర్మిస్తామన్నారు. ప్రాణహిత చేవెళ్ల ద్వారా రంగారెడ్డి జిల్లాకు నీరందించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ నిధులు కేటాయిస్తే కేసీఆర్ వాటిని మళ్లించారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఈ భాస్కర్, చేవెళ్ల ఎస్ఈ సీతారాం, ఈఈ రేణుక, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

రైతు సమస్యలు పట్టించుకోరా?

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

అనంతగిరి: రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్ పట్టణ పరిధిలోని శివారెడ్డిపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. క్యూలో నిలబడి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అన్నదాతలు పొలం పనులు వదిలేసి యూరియా కోసం తిరగాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి.. కేంద్రం వాటా అందకపోవడం వల్లే యూరియా కొరత వస్తోందని చెబుతుంటే సీఎం మాత్రం కొరతే లేదని చెబుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు.కేసీఆర్ పాలనలో ఏ రోజూ యూరియా కొరత రాలేదన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చూడాల ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు మేక శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుభాన్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కిశోర్ గయాజ్ పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన

షాద్‌నగర్‌రూరల్: గణేశ్ నవరాత్రుల్లో భాగంగా నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ సూచించారు. బొబ్బిలి చెరువు, దూసకల్, బుచ్చిగూడ చెరువులను గురువారం ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మండప నిర్వాహకులకు చెరువులను విభజించి రూట్ మ్యాప్ ఇవ్వాలని, దాని ప్రకారం నిమజ్జనాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువుల్లో నీరు నిండుగా ఉందని, నిమజ్జన సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. డీసీపీ వెంట మున్సిపల్ కమిషనర్ సునీత, డీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాంచందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్ ఉన్నారు.



బొబ్బిలిచెరువును పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్ తదితరులు

యూరియాపై భరోసా కల్పించండి

- రైతులు ఆందోళన చెందొద్దు
- వారం రోజుల్లో మరో 640 మెట్రిక్ టన్నుల సరఫరా
- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: యూరియా దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో యూరియా లభ్యత, నానో యూరియా వాడకం, చెక్ పోస్టుల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా పంపిణీపై రైతులకు భరోసా కల్పించాలన్నారు. జిల్లాకు ఇప్పటి వరకు 20,124 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. వారం రోజుల్లో మరో 640 మెట్రిక్ టన్నులు రానున్నట్లు చెప్పారు. సొసైటీల్లో 184 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 596 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. మార్క్ ఫెడ్ సొసైటీలకు 100 మెట్రిక్ కన్నులు తరలిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు యూరియా అక్రమంగా తరలించకుండా సరిహద్దు చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచామన్నారు. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం, ఏడీఏ సందీప్ కుమార్, ఏడీలు సౌభాగ్యలక్ష్మి, శంకర్ నాయక్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకు ఉంటుందని.. వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ విధానాన్ని సక్రమంగా నిర్వహించాలని, తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టులపై విద్యార్థులు పట్టు సాధించేలా బోధన చేయాలన్నారు. ఎంఈఓలు ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శించి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఈఓ రేణుకాదేవి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్, ఎస్పీ

వికారాబాద్ పట్టణంలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో గురువారం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, జిల్లా అదనపు ఎస్పీ (డీటీసీ ప్రిన్సిపాల్) పీవీ మురళీధర్, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఏటీసీల్లో కోర్సులు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరు, వికారాబాద్, మోమిన్‌పేట్‌లో యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆగస్టు 30 వరకు కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో టీజీఐటీ వైస్ చైర్మన్ సరిత, ఐటీఐ ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి ఎస్ఏ సుభాన్, ట్రైనింగ్ ఆఫీసర్ సరోష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

క్లుప్తంగా

యూరియా సరఫరా కేంద్రాల్లో తనిఖీ


దుకాణంలో పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు

అనంతగిరి: వికారాబాద్‌లోని యూరియా సరఫరా(విక్రయం) చేస్తున్న పీఏసీఎస్ శివారెడ్డి పేట, కిసాన్ ఆగ్రోస్, రైతు ఆగ్రోస్, గుల్షాన్ ఫర్టిలైజర్స్, శ్రీ లక్ష్మీనారాయణ ఏజెన్సీలను జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా స్థావరాలలో ఉన్న యూరియా స్టాక్‌ను పరిశీలించారు. ఎంత వచ్చింది.. ఎంత విక్రయించారు.. ఎంత నిల్వ ఉందో అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి ప్రసన్నలక్ష్మి తదితరులు ఉన్నారు.

వామపక్షాల పోరాటంతోనే ఉచిత విద్యుత్


అమరుల చిత్రపటం వద్ద నేతలు

అనంతగిరి: ఇరవై ఐదు ఏళ్ల క్రితం వామపక్ష పార్టీలు చేసిన పోరాట ఫలితమే నేడు ప్రజలు అనుభవిస్తున్న ఉచిత విద్యుత్ అని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా ముఖ్య నాయకులు మైపాల్, గోపాల్‌రెడ్డి, మహేందర్ అన్నారు. ఈ మేరకు గురువారం విద్యుత్ పోరాటం జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వికారాబాద్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో పోరాట అమరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ జెండా ఆవిష్కరణ



అనంతగిరి: వికలాంగుల హక్కుల పోరాట సమితి 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వికారాబాద్‌లో ఆ సంఘం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్, నాయకుడు వెంకట్, సోషలిస్టు పార్టీ నాయకురాలు పుష్పరాణి, పద్మమ్మ, సునీత, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాగులో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు


సంగమేశ్వర్ (ఫైల్)

బంట్వారం: ఇంట్లో గొడవపడి మనస్తాపంతో ఓ వ్యక్తి వాగులో దూకి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన కోట్‌పల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శైలజ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోట్‌పల్లికి చెందిన చాకలి సంగమేశ్వర్(38) ఇంట్లో గొడవపడి బుధవారం మధ్యాహ్నం బయటికి వెళ్లిపోయాడు. ఆయన భార్య లక్ష్మి గమనించి వెంబడించగా సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కోట్‌పల్లి వాగులో దూకాడు. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. గురువారం గజ ఈతగాళ్లతో వాగులో గాలింపు చర్యలు చేపట్టిన సంగమేశ్వర్ ఆచూకీ దొరకలేదు. ధారూరు సీఐ రఘురాములు కోట్‌పల్లి వాగును సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. వాగులో అదృశ్యమైన సంగమేశ్వర్ సెంట్రింగ్ పనులతో పాటు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు భార్య లక్ష్మి, ముగ్గురు ఆడపిల్లలున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


వెంకటయ్య (ఫైల్)

బొంరాస్‌పేట: మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ బాలవెంకటరమణ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రాస్నం వెంకటయ్య(36) రెండు వారాలుగా మద్యం తాగుతూ, ఖాళీగా ఉంటున్నాడు. ఈ విషయమై తండ్రి హన్మయ్య అతన్ని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటయ్య ఈనెల 24న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే అతన్ని తాండూరు ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇక రెండు రోజులే!

తాండూరు ఏటీసీ ప్రవేశాలకు ముగుస్తున్న గడువు
- పది, ఇంటర్ డ్రాపౌట్ విద్యార్థులకు సదవకాశం
- నైపుణ్యం మెరుగు పరిచేలా శిక్షణ
- అనంతరం ఉద్యోగ కల్పనకు చొరవ



తాండూరులో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్


రోబోటిక్ శిక్షణ కోసం బిగించిన యంత్రాలు

తాండూరు: గ్రామీణ విద్యార్థుల్లో సాంకేతిక ప్రతిభను వెలికి తీసేందుకు తాండూరులో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. నైపుణ్య విద్యలో శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకొనే అవకాశం కల్పించింది. కానీ అధికార యంత్రాంగం విద్యార్థులకు ఏటీసీ నైపుణ్య విద్యపై అవగాహన పెంచడంలో విఫలమైంది. గడువు దగ్గర పడుతున్నా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. మరో రెండు రోజుల వ్యవధిలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని యంత్రాంగంపై ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం.

అందుబాటులో ఆరు కోర్సులు

జిల్లాలో పారిశ్రామిక కేంద్రంగా తాండూరు కొనసాగుతోంది. విద్యార్థులకు నైపుణ్య విద్యపై శిక్షణ అందించేందుకు రూ.85 కోట్ల నిధులతో రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించింది. దీనికి పట్టణ శివారులో ఐదు ఎకరాల్లో రూ.25 కోట్లతో భవనాన్ని నిర్మించారు. రూ.60 కోట్ల నిధులను కేటాయించి విద్యార్థులకు శిక్షణ కల్పించేందుకు కావాల్సిన సాంకేతిక, యంత్ర సామగ్రి కేంద్రానికి చేరుకున్నాయి. ఈ సెంటర్‌లో మొత్తం 172 మంది విద్యార్థులకు శిక్షణ కల్పించేందుకు సీట్లు ఉన్నాయి. ఆరు కోర్సులపై దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అందులో ఇండస్ట్రియల్ రోబోటిక్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్(ఏడాది), మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్(ఏడాది), ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్(ఏడాది), బీడీవీఏ వర్చువల్ ఏనాలసెస్ అండ్ డిజైనర్(రెండేళ్లు), సీఎస్‌సీ మెషినింగ్ టెక్నీషియన్(రెండేళ్లు), మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్(రెండేళ్లు) ఏటీసీ సెంటర్ ద్వారా నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వనున్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు పదో తరగతి మెమో, బోనఫైడ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కుల ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, టీసీ తప్పనిసరిగా జత చేయాల్సి ఉంటుంది.

శిక్షణ పొందితే భవిష్యత్

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో ఈ విద్యా సంవత్సరానికి ఇంకా 132 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అత్యాధునిక సాంకేతిక సామర్థ్యంతో ఏటీసీ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలి. ప్రభుత్వం సీట్ల భర్తీకి గడువు పెంచే అవకాశం ఉంది.
– సాయన్న, ప్రిన్సిపాల్, ఏటీసీ, తాండూరు

జాబ్ గ్యారంటీ

అసెంబ్లీ ఎన్నికల్లో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాను. అందులో భాగంగా ఏటీసీ ఏర్పాటు చేశాం. విద్యార్థులు నైపుణ్య విద్యపై శిక్షణ తీసుకునే అవకాశం కల్పించాం. ఇక్కడ నైపుణ్యం అందించేలా నిష్ణాతులైన అధ్యాపకులను నియమించాం. శిక్షణ పొందితే జాబ్ పక్కాగా వస్తోంది.
– మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

ఖాళీగా 132 సీట్లు

ఐటీఐ, ఏటీసీ కోర్సుల్లో శిక్షణ పొందే విద్యార్థులకు ఏటా ఆగస్టు నెలలో విద్యా సంవత్సరం ప్రారంభమవుతోంది. తాండూరు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రంలో మొత్తం 172 మందికి శిక్షణ కల్పించేందుకు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఏటీసీలో 40 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఇంకా 132 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

70 గొర్రెలు మృత్యువాత

- రూ.9 లక్షల నష్టం
- ఆదుకోవాలని బాధితుల వేడుకోలు


జాతీయ రహదారిపై మృత్యువాత పడిన గొర్రెలు


ట్రాక్టర్‌లో కళేబరాల తరలింపు

బొంరాస్‌పేట: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనాలు ఢీకొని 70 గొర్రెలు మృతిచెందగా మరో 13 తీవ్రంగా గాయపడ్డాయి. మండల పరిధిలోని తుంకిమెట్ల, బొంరాస్‌పేట శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నాందార్‌పూర్ గ్రామానికి చెందిన గిర్మి మల్కప్ప, రాయికంటి ఎల్లప్ప గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. సుమారు 150 జీవాలను మూడు రోజులుగా తుంకిమెట్ల శివారులో మేపుతున్నారు. మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని ఖాళీ స్థలంలో మంద పెట్టారు. పొద్దంతా వానలో తడిసిన మల్కప్ప దుస్తులు మార్చుకునేందుకు ఇంటికి వెళ్లాడు. మంద వద్ద కాపలాగా ఉన్న ఎల్లప్ప కునుకు తీయడంతో వానకు తడిసిన గొర్రెలు ఒక్కొక్కటిగా పక్కనే ఉన్న బీజాపూర్– హైదరాబాద్ హైవే పైకి చేరుకున్నాయి. బొంరాస్‌పేట చెరువు అలుగు సమీపంలోని వంతెన వద్ద గుర్తు తెలియని వాహనాలు ఢీకొనడంతో మల్కప్పకు చెందిన 40 గొర్రెలు, ఎల్లప్పకు చెందిన 30 గొర్రెలు చనిపోయాయి. మరో 13 జీవాలు తీవ్రంగా గాయపడ్డాయి. దీంతో తమకు రూ.9 లక్షల నష్టం కలిగిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి, ఆదుకోవాలని కోరారు. ప్రమాద విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్సింలుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, మల్లేశం, యాదయ్య యాదవ్ తదితరులు బాధితులను పరామర్శించారు.

ఆదుకోవాలి



మా అత్తగారి బంగారం అమ్మి రూ.8 లక్షలతో గొర్రెలు కొన్నాం. రూ.6 లక్షలు విలువ చేసే 40 జీవాలు చనిపోయాయి. సీఎం సారు స్పందించి ఆదుకోవాలి.
– గిర్మి మల్కప్ప

అప్పు చేసి తెచ్చుకున్నాం



గొర్రెల పెంపకమే మా బతుకుదెరువు. కునుకుపాటులో జీవాలను కోల్పోయాం. రూ.3 లక్షల వరకు నష్టపోయా. ఏం చేయాలో, ఎవరిని అడుగాలో తోచడంలేదు.
– ఎల్లప్ప

ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

వీఓఏల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్


కడా కార్యాలయ అధికార సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

కొడంగల్ రూరల్: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొడంగల్ రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకేపీ వీఓఏల నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొడంగల్ రమేశ్, ఉపాధ్యక్షుడిగా దౌల్తాబాద్ గోపాల్, ప్రధాన కార్యదర్శిగా బొంరాస్‌పేట సూర్యానాయక్, కార్యదర్శిగా మద్దూరు శ్రీనివాస్, కోశాధికారిగా కోస్గి బుగ్గప్పలతోపాటు కమిటీ మెంబర్లుగా పురుషోత్తం, జ్యోతి, లక్ష్మి, అంజిలయ్య, గురునాథ్, కృష్ణ, శేఖర్‌లతోపాటు మరి కొంతమందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ ఆధ్వర్యంలో వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని కడా కార్యాలయ సిబ్బందికి, తహసీల్దార్ విజయకుమార్‌కు వేరు వేరుగా వినతిపత్రాలు అందించారు. రమేశ్ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా నిత్యం గ్రామంలో ఉంటూ గ్రామ మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఆన్‌లైన్ పని భారం ఎక్కువయ్యిందని, ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. వీఓఏల కనీస వేతనం రూ.26 వేలు అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

హత్య కేసులో విచారణ కమిటీ వేయాలి

పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ


స్వాతి కుటుంబీకులను పరామర్శిస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

అనంతగిరి: కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న స్వాతి హత్య పట్ల విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని పీఓడబ్ల్యూ(ప్రగతి శీల మహిళ సంఘం) రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, కార్యదర్శి గీత డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వికారాబాద్ మండలం కామరెడ్డిగూడ గ్రామంలో బాధిత కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెళ్లయ్యాక కుట్ర పూరితంగా హైదరాబాద్ తీసుకెళ్లి అమ్మాయిని అనేక హింసలకు గురి చేసి చివరకు పక్కా ప్రణాళికతో చంపేశారన్నారు. అంతేకాకుండా శరీర భాగాలను దొరకకుండా మాయం చేయడం క్షమించరాని నేరమన్నారు. ఇలాంటి ఘటన యావత్ రాష్ట్రాన్ని కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేక కమిటీని వేసి నిజాలను బయటకు తీసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకురాళ్లు భారతి, ప్రేమలత, ప్రభావతి, అంజమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రత్యేక' వైద్య శిబిరం

మోమిన్‌పేట: వికారాబాద్ పట్టణంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం అంగవైకల్యం ఉన్న వారికి ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు (ఆశ్రయ్ –అకృతి) స్వచ్ఛంద సంస్థ సభ్యుడు మోహన్‌సింగ్ గురువారం తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు మెమో జారీ

అనంతగిరి: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్. ఆనంద్‌కు కలెక్టర్ మెమో జారీ చేశారు. గురువారం వికారాబాద్ జిల్లా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న 9 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కలెక్టర్ అనుమతి లేకుండా, ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా బదిలీ చేయడం జరిగింది. దీంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పరిపాలన పనులకు ఆటంకం ఏర్పడింది. అట్టి మెమోకు ఒక్క రోజులో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

పలు అంశాలపై అవగాహన

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారంలో సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు గురువారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ వ్యవస్థపై నాటిక ప్రదర్శనతో అవగాహన కల్పించారు. కుటుంబీకుల పాత్ర, బాధ్యతలను వివరించారు. వివిధ రాష్ట్రాల ప్రజల వస్త్రధారణను ప్రదర్శించారు.

పేదల బియ్యం వర్షార్పణం

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- జిల్లాలో నిరుపయోగంగా మిగులు బియ్యం


కొడంగల్‌లో వర్షానికి నానిన దొడ్డు బియ్యం

కొడంగల్: రేషన్ డీలర్ల దగ్గర మిగిలిన దొడ్డు బియ్యం గురించి జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. ఐదు నెలలు గడుస్తున్నా మిగులు బియ్యం గురించి ఆలోచించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు డీలర్ల దగ్గర ఉన్న బియ్యం నానుతున్నాయి. ఎలుకలు, పంది కొక్కులకు ఆహారంగా మారాయి. పేదల బియ్యం వర్షానికి నాని చెడిపోతున్నాయని డీలర్లు లబోదిబోమంటున్నారు.

వందలాది క్వింటాళ్లు

జిల్లా వ్యాప్తంగా 588 రేషన్ దుకాణాలున్నాయి. ఇందులో ప్రతి నెలా 8,97,270 మంది వినియోగదారులు ఉచిత బియ్యం అందుకుంటున్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబంలో ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున బియ్యాన్ని ఇస్తున్నారు. జిల్లాలో 2.09 లక్షల ఆహార భద్రత కార్డులు, 25వేల అంత్యోదయ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా జిల్లా పరిధిలో 5,200 టన్నుల బియ్యం అలాట్‌మెంట్ ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఉగాది కానుకగా సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించింది. ఏప్రిల్ మాసం నుంచి సన్న బియ్యం పంపిణీ చేశారు. దీంతో మార్చి నెల వరకు రేషన్ డీలర్ల దగ్గర మిగిలిన దొడ్డు బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు డీలర్ల దగ్గరే ఉంచారు. జూన్ నెలలో జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి వినియోగదారులకు అందజేశారు. జులై, ఆగస్టు నెలల్లో రేషన్ దుకాణాలను తెరవలేదు. మిగిలిన ఉన్న దొడ్డు బియ్యం వర్షానికి నాని పురుగుల పాలు అవుతున్నాయి. రేషన్ దుకాణాలు చిన్నపాటి గదుల్లో ఉన్నాయి. అక్కడ దొడ్డు, సన్న బియ్యం నిల్వ చేసుకోడానికి డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. అధికారుల స్పందించి నిరుపయోగంగా ఉన్న దొడ్డు బియ్యాని రేషన్ దుకాణాల నుంచి తరలించాలని డీలర్లు కోరుతున్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



దౌల్తాబాద్: మండల కేంద్రంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఓ ఇల్లు కూలింది. తోక బొంబాయి రామప్ప తన బండల ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో రాత్రి సమయంలో ఇల్లు పైకప్పు కూలి కింద పడింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తమకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని బాధితుడు కోరుతున్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

దోమ: ఆర్టీసీ బస్సులో మర్చిపోయిన పర్సును తిరిగి ప్రయాణికురాలికి అప్పగించి కండక్టర్ సేవాగుణం చాటుకున్నారు. పరిగి, మహబూబ్‌నగర్ వెళ్తున్న బస్సులో దోర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పరి మాణెమ్మ బుధవారం పరిగికి ఆస్పత్రి నిమిత్తం వెళ్లింది. తిరిగి పరిగి డిపోలో బస్సు ఎక్కి గొడుగోనిపల్లి గేట్ సమీపంలో దిగి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆమె పర్సు బస్సులోనే మర్చిపోయింది. గమనించిన కండక్టర్ పార్వతమ్మ పార్సులో ఉన్న ఆధార్‌కార్డు, రూ.8 వేలను గుర్తించి భద్రంగా పెట్టుకుంది. తర్వాత కండక్టర్ పర్సులో ఉన్న నంబర్ ఆధారంగా ఫోన్ చేసి విషయాన్ని తెలిపింది. తిరిగి బస్సు గొడుగోనిపల్లికి చేరుకున్న తర్వాత బాధితురాలికి కండక్టర్ అందజేశారు.

అధికారులు సెలవుపై వెళ్లొద్దు

- వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు, రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి, ఎలాంటి ప్రమాదాల సంభవించకుండా చూడాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగు పరుతున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో అధికారులు సెలవులపై వెళ్లొదన్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు వర్షాలకు దెబ్బతిన్న రోడ్లపై దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలన్నారు. వైద్యులు, సిబ్బంది కచ్చితంగా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మున్సిపాలిటీల్లో చెత్త చెదారం, మురికి నీరు నిల్వకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యుత్ పంపిణీలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయంజాల్‌లో పెద్దఎత్తున నిర్వహించే గణేశ్ నిమజ్జనోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ ఏడాది మంజూరు చేసిన ఐదు వేల ఇందిరమ్మ ఇళ్లలో నాలుగు వేలు గ్రౌండింగ్ పూర్తి కావాలని ఆదేశించారు. కొలతలకు తగ్గట్టుగా స్థలాలు లేకపోవడంతో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిని గుర్తించి సరి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజుతోపాటు ఆయా మండలాల ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

42 మందికి జరిమానా

తాండూరు టౌన్: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి జైలు శిక్షతో పాటు పలువురికి జిల్లా ట్రైనీ కలెక్టర్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ హర్షాచౌదరి గురువారం జరిమానా విధించినట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడిపినందుకు గాను రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.3,500 జరిమానా విధించారు. అలాగే మరో 42 మందికి మొత్తం రూ.83,500 జరిమానా విధించినట్లు సీఐ చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు.

వ్యాధుల కాలం.. శుభ్రతే మంత్రం


గొల్లగూడలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపునీరు

- ఈగలు, దోమలతో పొంచి ఉన్న ప్రమాదం
- పారిశుద్ధ్య లేమితో పెరగనున్న సంతతి
- ముందస్తు చర్యలు పాటిస్తే మేలంటున్న వైద్యనిపుణులు

నవాబుపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో దోమలు, ఈగలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం గ్రామాల్లో వర్షపునీరు నిలిచి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో భయంకరమైన సీజనల్ వ్యాధులు సంభవించే ఆస్కారం ఉంది. గ్రామాలు, పట్టణాల్లో మురుగు, వర్షం నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ఈగ చిన్నదైనా అది ఎన్నో వ్యాధులకు కారణమవుతుంది. ఈగకు కుట్టే గుణం లేకున్నా మెడికల్ ట్రాన్స్‌ఫర్ విధానం వల్ల రోగాలను తెచ్చి పెడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

వ్యాప్తి ఇలా..

దోమ కాటుతో డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వ్యాధులతో వస్తున్న రోగాల సంఖ్య కంటే వర్షాకాలంలో కామెర్లు, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. దోమ కాటుకు గురైన రోగిని వాక్సిన్ ద్వారా నయం చేయడానికి అవకాశాలున్నాయి. ఈగలతో వచ్చే వ్యాధుల నుంచి ప్రజలను కాపాడే పరిస్థితి వైద్యులకు పెద్ద తల నొప్పిగా మారుతుందని పలువురు పేర్కొంటున్నారు. ప్రధానంగా బహిర్భూమి, అపరిశుభ్రమైన ప్రాంతాల్లో ఈగలు ఎక్కువగా వృద్ధి చెందుతాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ వేసే చెత్తచెదారంతో పాటు మాంసం, చికెన్ విక్రయ కేంద్రాలు, మురుగు కాలువలు మొదలగు ప్రాంతాల్లో ఈగలు తమ సంతతిని పెంచుకొని ఇళ్లల్లో ప్రవేశిస్తాయి.

వర్షాకాలంలో వచ్చే వ్యాధులు

టైఫాయిడ్: ఎక్కువ రోజుల పాటు జ్వరం తీవ్ర నీళ్ల విరేచనాలు, చీమూ, బంక విరేచనాలతో శరీరంలో ఉండే నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ వస్తుంది. వీటిని టైఫాయిడ్ లక్షణాలుగా గుర్తించాలి.

కలరా: నీళ్ల విరేచనాలు, వాంతులు రావడం తర్వాత శరీరంలో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ రావడం జరుగుతుంది.

పచ్చ కామెర్లు: కాలేయానికి వాపురావడం, కళ్లు పసుపు పచ్చగా మారడం, ఆకలి మందగించడం, నీరసంగా ఉండటాన్ని కామెర్లుగా గుర్తించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు
- కాచి, వడబోసిన తాగునీటినే తాగాలి.
- ఇంటి పరిసరాలతో పాటు, ఇంటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి.
- పరిసరాల్లో ఈగలు, దోమలు వ్యాప్తి కారకాలను నిరోధించడం.
- అపరిశుభ్ర ప్రదేశాలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.

పరిశుభ్రతే ముఖ్యం



వర్షాకాలంలో పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. నివాసాలు, పరిసరాల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తినుబండరాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. వేడి పదార్థాలనే తినాలి. అస్వస్థతకు గురైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి.
– డా.రోహిత్ వేముల, నవాబుపేట